# జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

## పౌరసత్వం

**పౌరసత్వ భావన మొదటిసారిగా గ్రీకు నగర రాజ్యాల్లో అవతరించింది. ఆధునిక జాతి – రాజ్యాల (Nation – State) అవతరణ తర్వాత పౌరసత్వ భావనకు మరింత ప్రాధాన్యం పెరిగింది. ప్రఖ్యాత రాజనీతి తత్వవేత్త అరిస్టాటిల్ 'పౌరుల సమాజమే రాజ్యం' అని అభివర్ణించారు.**

ఏదేశ జనాభానైనా రెండు వర్గాలుగా విభజిస్తారు. పౌరులు (Citizens), విదేశీయులు (Aliens).

పౌరసత్వం (Citizenship) అనేది వ్యక్తి చట్టబద్ధతను తెలియజేస్తుంది. దేశంలో సంపూర్ణమైన స్థాయిని కలిగి ఉండటమే కాకుండా ఆ దేశం ప్రసాదించే పౌర, రాజకీయ హక్కులను పొందుతారు.

- ✪ విదేశీయులకు మానవతా దృక్పథంతో కొన్ని పౌరహక్కులను మాత్రమే కల్పిస్తారు. రాజకీయ హక్కులు కల్పించరు.

### భారతదేశం – పౌరసత్వం – ప్రాధాన్యం

భారతదేశ రాజ్యాంగం నిర్మించే దశలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలు చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఎందుకంటే భారత పౌరసత్వం పొందేందుకు అర్హులైనవారికి ప్రత్యేక హక్కులు కల్పించాలని రాజ్యాంగకర్తలు భావించారు.

### భారత రాజ్యాంగం – భారత పౌరుల ప్రత్యేక హక్కులు

- ✪ ఈ హక్కులను విదేశీయులకు నిరాకరించారు.
  - ఎ) ప్రాథమిక హక్కులు – అధికరణ – 15, 16, 19, 29, 30
  - బి) రాజ్యాంగంలోని కొన్ని పదవులు –రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తులు, అటార్నీ జనరల్, రాష్ట్ర గవర్నర్, అడ్వకేట్ జనరల్ మొదలైన పదవులు.
  - సి) లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసే అధికారం, సభ్యుడయ్యే అవకాశం.
- ✪ అలాగే కొన్ని బాధ్యతలు: ముఖ్యంగా పన్నులు చెల్లించడం, జాతీయ పతాకాన్ని, గీతాన్ని, గేయాన్ని గౌరవించడం, దేశ రక్షణ మొదలైనవి.

### పౌరులతో సమానంగా విదేశీయులకు కల్పించే కొన్ని పౌరహక్కులు/ ప్రాథమిక హక్కులు

- ✪ ప్రాథమిక హక్కులు – అధికరణ – 14, 20, 21, 23, 25, 27

### భారత రాజ్యాంగం – పౌరసత్వ ప్రాతిపదికలు

భారత రాజ్యాంగం రెండోభాగంలోని 5 నుంచి 11 వరకు ఉన్న అధికరణలు పౌరసత్వ భావనలను ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇవి కేవలం రాజ్యాంగ అమలు నాటికి ఉన్న వ్యక్తుల గురించి తప్ప, తర్వాత

కాలంలో దేశ పౌరసత్వాన్ని పొందే పద్ధతుల (acquisition) గురించి లేదా పౌరసత్వాన్ని కోల్పోయే (loss of citizenship) పద్ధతుల గురించి ఎలాంటి విశ్లేషణపూర్వక నిబంధనలను పేర్కొనలేదు.

✪ ఈ అధికారాన్ని అధికరణ – 11 ద్వారా భారత పార్లమెంట్‌కు దాఖలుపరిచారు. అంటే పార్లమెంట్ కాలానుగుణంగా రూపొందించే చట్టాలను అనుసరించి భారతదేశ పౌరసత్వాన్ని పొందే పద్ధతులు, కోల్పోయే పద్ధతులను నిర్ణయిస్తారు.

## భారత పౌరసత్వ చట్టం – 1955

మొదటిసారిగా 1955 లో భారత పౌరసత్వ చట్టాన్ని రూపొందించారు. మారుతున్న అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా 1986, 1992, 2003, 2005 లలో పౌరసత్వ చట్టాన్ని సవరించారు.

✪ భారత పౌరసత్వాన్ని పొందే పద్ధతులు

భారత పౌరసత్వ చట్టం – 1955 ను అనుసరించి కింది పద్ధతుల ద్వారా భారత పౌరసత్వాన్ని పొందవచ్చు.

ఎ) **జన్మతః (By birth):** 1950 జనవరి 26 తర్వాత భారతదేశంలో జన్మించిన వారందరూ భారతీయ పౌరులవుతారు. అయితే విదేశీయులు, విదేశీ రాయబారులు మొదలైన వారికి ఈ నిబంధన వర్తించదు.

బి) **వారసత్వ రీత్యా (By descent):** భారతీయ తల్లిదండ్రులకు విదేశాల్లో సంతానం కలిగినప్పుడు, వారు తమ తల్లిదండ్రుల ద్వారా భారత పౌరసత్వాన్ని పొందవచ్చు.

సి) **నమోదు ద్వారా (By Registration):** భారతీయ పౌరసత్వం ఉన్న వ్యక్తి విదేశీయులను వివాహమాడితే, వారు కొన్ని షరతులకు లోబడి ఈ పద్ధతి ద్వారా పౌరసత్వం పొందవచ్చు.

డి) **సహజీకృతం (By naturalisation):** విదేశీయులు తమకు సహజసిద్ధంగా లభించిన మాతృదేశ పౌరసత్వాన్ని త్యజించి భారతదేశం పట్ల మక్కువతో భారతీయ పౌరసత్వాన్ని కోరుకుంటే కొన్ని షరతులతో ఈ పద్ధతి ద్వారా పౌరసత్వాన్ని కల్పించవచ్చు.

ఇ) **భూభాగాల విలీనం ద్వారా (By incorporation of Territory):** ఏవైనా ఇతర భూభాగాలు భారతదేశంలో విలీనమైనప్పుడు ఆ భూభాగంలో నివసించే ప్రజలు ఈ పద్ధతి ద్వారా పౌరసత్వం పొందవచ్చు.

## భారత పౌరసత్వాన్ని కోల్పోవడం

భారత పౌరసత్వ చట్టం – 1955 ను అనుసరించి ఈ కింది సందర్భాల్లో భారత పౌరసత్వాన్ని కోల్పోవచ్చు.

ఎ) **స్వతహాగా పరిత్యజించడం (By renunciation):** ఏ భారతీయుడైనా విదేశీ పౌరసత్వాన్ని పొందాలనే కోరికతో తనకు తానుగా మనదేశ పౌరసత్వాన్ని వదులుకోవడం. అలాంటి పరిస్థితుల్లో భారత ప్రభుత్వం అతని పౌరసత్వాన్ని రద్దు చేస్తుంది.

బి) **అంతమవడం (Termination):** భారతీయ పౌరసత్వం ఉన్న వ్యక్తి విదేశీ పౌరసత్వాన్ని స్వీకరించినప్పుడు సహజసిద్ధంగానే భారతదేశ పౌరసత్వాన్ని కోల్పోతాడు.

www.eenadupratibha.net

సి) **అనివార్య తొలగింపు (By deprivation):** ఒక వ్యక్తి అక్రమంగా, మోసపూరితంగా భారత పౌరసత్వాన్ని పొందడం లేదా భారత సార్వభౌమత్వాన్ని సవాలు చేయడం లాంటి సంఘటనలకు పాల్పడినప్పుడు ఆ వ్యక్తి పౌరసత్వాన్ని రద్దు చేస్తారు.

## భారత పౌరసత్వ స్వభావం

## (Nature of Indian Citizenship)

భారత రాజ్యాంగం సమాఖ్య స్వభావాన్ని కలిగి ఉంది. సమాఖ్య వ్యవస్థల్లో సాధారణంగా ద్వంద్వ పౌరసత్వం ఉంటుంది. కానీ భారతదేశం ఏక పౌరసత్వ విధానాన్ని అనుసరించింది. అంటే భారతదేశంలో ఎక్కడ జన్మించినా పౌరులు ఒకే పౌరసత్వాన్ని పొందుతారు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తారు.

- ఏక పౌరసత్వాన్ని అనురిస్తున్నప్పటికీ ద్వంద్వ పౌరసత్వ దేశాల్లోలాగే కొన్ని రాష్ట్రాల్లో విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- ఉదాహరణకు భారత రాజ్యాంగం అధికరణం-370 ద్వారా జమ్మూ కశ్మీర్ రాష్ట్ర శాసనసభకు ప్రత్యేక పౌరసత్వ చట్టాన్ని రూపొందించే అధికారం ఉంది. అంటే జమ్మూ కశ్మీర్ ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు. తదనుగుణంగా ఆ రాష్ట్ర ప్రజలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నారు.
- అధికరణ – 371, 371 (A) – 371 (J) ద్వారా కొన్ని రాష్ట్రాల కోసం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

| అధికరణం | ప్రత్యేక సదుపాయం ఉన్న రాష్ట్రం |
|---|---|
| 371 | మహారాష్ట్ర, గుజరాత్ |
| 371 (A) | నాగాలాండ్ |
| 371 (B) | అసోం |
| 371 (C) | మణిపూర్ |
| 371 (D), 371 (E) | అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ |
| 371 (F) | సిక్కిం |
| 371 (G) | మిజోరాం |
| 371 (H) | అరుణాచల్ ప్రదేశ్ |
| 371 (I) | గోవా |
| 371 (J) | హైదరాబాద్ – కర్ణాటక ప్రాంతం |

- భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి వివిధ సంస్కృతుల మేళవింపుతో ఫరిడవిల్లుతోంది. రాజ్యాంగ పీఠికలోని ఆదర్శాలకు అనుగుణంగా దేశ సమగ్రతను, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించడానికి ఆ ప్రాంత చారిత్రక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## భారతదేశం ద్వంద్వ పౌరసత్వం (Duel citizenship) కల్పిస్తుందా?

ప్రవాస భారతీయుల (Indian Diaspora) పై ఎల్.ఎం.సింఘ్వీ అధ్యక్షతన నియమించిన ఉన్నత స్థాయి కమిటీ (2000) ప్రవాస భారతీయులు భారతదేశ సమగ్ర అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు వీలు కల్పించేలా పలు సూచనలు చేసింది. అందులో ముఖ్యమైనవి:

- ప్రపంచ దేశాల్లో వారి విజయాలను, స్థాయిని గుర్తించడానికి 'ప్రవాస భారతీయ దివస్'ను నిర్వహించడం.
- ద్వంద్వ పౌరసత్వాన్ని కల్పించడం.
- ఈ కమిటీ సూచనలను అనుసరించి భారత ప్రభుత్వం 2003 నుంచి మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చిన జనవరి 9 ని పురస్కరించుకుని, ప్రవాస భారతీయ దివస్‌ను నిర్వహిస్తోంది.

**ముఖ్య ప్రవాస భారతీయ దివస్‌లు**

| సంవత్సరం | ప్రదేశం |
|---|---|
| 2003 (మొదటిది) | న్యూఢిల్లీ |
| 2006 | హైదరాబాద్ |
| 2014 | న్యూఢిల్లీ |
| 2015 | గాంధీనగర్ (మహాత్మా మందిర్) |

### నమూనా ప్రశ్నలు

**1.** భారత రాజ్యాంగంలోని ఎన్నో భాగం భారత పౌరసత్వం గురించి పేర్కొంటుంది?

1) I వ భాగం 2) II వ భాగం 3) III వ భాగం 4) IV వ భాగం

**2.** కిందివాటిలో ఏ ప్రాథమిక హక్కును భారత పౌరులు మాత్రమే అనుభవించగలరు?

1) అధికరణ – 14 2) అధికరణ – 16 3) అధికరణ – 20 4) అధికరణ – 21

**3.** కిందివాటిలో ఏ ప్రాథమిక హక్కును భారత పౌరులతో పాటు విదేశీయులు కూడా అనుభవించగలరు?

1) అధికరణ – 15 2) అధికరణ – 16 3) అధికరణ – 19 4) అధికరణ – 23

**4.** పౌరసత్వ హక్కులను చట్టం చేయడం ద్వారా క్రమబద్ధం చేయగల అధికారం ఎవరికి ఉంది?

1) పార్లమెంట్ 2) సుప్రీంకోర్టు 3) రాష్ట్ర చట్టసభలు 4) రాష్ట్రపతి

**5.** ఇతర భూభాగాలను భారతదేశంలో కలపడం ద్వారా లభించిన పౌరసత్వానికి ఉదాహరణ ఏది?

1) సిక్కిం 2) గోవా 3) పాండిచ్చేరి 4) పైవన్నీ

**6.** కింది భారతదేశ రాష్ట్రాల్లో ద్వంద్వ పౌరసత్వం ఉన్న రాష్ట్రం ఏది?

1) గోవా 2) పాండిచ్చేరి 3) జమ్మూ కశ్మీర్ 4) సిక్కిం

**7.** మొట్టమొదటిసారిగా భారత పౌరసత్వ చట్టాన్ని ఏ సంవత్సరంలో రూపొందించారు?

1) 1947 2) 1950 3) 1955 4)1956

**8.** భారత రాజ్యాంగం ఏ రకపు పౌరసత్వాన్ని కల్పిస్తోంది?

1) ఏకపౌరసత్వం 2) ద్విపౌరసత్వం 3) బహుళ పౌరసత్వం 4) పైవన్నీ

**9.** కింది ఏ పద్ధతి ద్వారా భారతదేశ పౌరసత్వాన్ని పొందవచ్చు?

1) నమోదు ద్వారా (By Registration)

2) జన్మతః (By Birth)

3) భూభాగం విలీనం ద్వారా (By Incorporation of Territory)

4) పై అన్నిటి ద్వారా

**10.** కింది ఏ పద్ధతి ద్వారా భారతదేశ పౌరసత్వాన్ని కోల్పోతారు?

1) స్వతహాగా పరిత్యజించడం (By Renunciation)

2) అంతమవడం (Termination)

3) అనివార్య తొలగింపు (By Deprivation)

4) పైవన్నీ

**11.** సహజీకృత (By Naturalisation) ద్వారా పౌరసత్వం పొందిన ప్రముఖులు ఎవరు?

1) మదర్ థెరిసా 2) సోనియాగాంధీ

3) శ్రీమతి అనిబిసెంట్ 4) పై అందరూ

**12.** ప్రవాస భారతీయులపై సమగ్ర నివేదికను తయారు చేయడానికి భారత ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ (2000) ఏది?

1) అభిజిత్‌సేన్ 2) అబిద్ హుస్సేన్ 3) అజిత్‌కుమార్ 4) ఎల్.ఎం.సింఘ్వీ

## జవాబులు

1-2; 2-2; 3-4; 4-1; 5-4; 6-3; 7-3; 8-1; 9-4; 10-4; 11-1; 12-4.

**రచయిత: ఎల్. కొండబాబు**



www.eenadupratibha.net